సాక్షి
ములుగు

సోమవారం । 13 । జనవరి । 2025



మల్లన్నా.. శరణు శరణు

కోరిన కోర్కెలు తీర్చే ఐలోని మల్లన్న జాతర ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలతో ఆలయంలో పండుగ వాతావరణం నెలకొంది. - 8లో▸



కృపియా ధ్యాన్‌దే..

కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికులకు కావాల్సిన సౌకర్యాలు, సదుపాయాలను రైల్వే శాఖ ఏర్పాటు చేసింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/16^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చలి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు



ములుగు: జిల్లా ప్రజలకు కలెక్టర్ దివాకర భోగి, సంక్రాంతి శుభాకాంక్షలను ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగకు ప్రతిఇంటా ఆనందం వెల్లివిరియాలని కోరారు. రైతులు పాడి పంటలతో తులతూగి, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని వెల్లడించారు. సంక్రాంతి పండుగ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకని వివరించారు. పండుగ అందరిలో స్నేహభావం, సంతోషం నెలకొల్పాలని వివరించారు.

ప్రియాంకాగాంధీ జన్మదిన వేడుకలు



ములుగు: జిల్లా కేంద్రంలో ఆదివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంకా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య కేక్ కట్ చేసి కార్యకర్తలకు నాయకులకు పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి, నాయకులు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, పల్లె జైపాల్ రెడ్డి, బాధం ప్రవీణ్ కుమార్, నల్లెల భరత్, చిక్కుల రాములు, నేపాల్ రావు, అరుణ్ లాల్, అన్వేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



ములుగు: స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో సేవాభారతి, లయన్స్ క్లబ్, నెహ్రూ యువ క్లబ్ వరంగల్ వారు సంయుక్తంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 20మంది పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేయడంతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో చల్లగురిగల రాజువర్ధన్, కొత్తపల్లి పోషన్న, మేరుగు రమేష్, చంచ రమేష్, రవీందర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరేడ్ తిలకించేందుకు ఆదిలక్ష్మికి ఆహ్వానం



మంగపేట: మండల పరిధిలోని నిమ్మగూడెం పంచాయతీ పరిధిలో గల చింతకుంటకు చెందిన ఆదివాసీ గిరిజన మహిళ కొమరం ఆదిలక్ష్మి ఢిల్లీలో జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్‌ను తిలకించేందుకు అతిథిగా ఎంపికైంది. తెలంగాణ నుంచి ఆహ్వానితులుగా కేంద్ర ప్రభుత్వం 41మందితో కూడిన జాబితాను శనివారం విడుదల చేసింది. ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో నిర్వహించనున్న గణతంత్ర పరేడ్‌ను చూసేందుకు ప్రధానమంత్రి మోదీ యశస్వి పథకం, టెక్స్‌టైల్ (హస్తకళలు), గ్రామీణాభివృద్ధి, ప్రధాన మంత్రి జన్‌మన్ తదితర పథకాలకు సహకరించిన వ్యక్తులను పరేడ్ తిలకించేందుకు ప్రత్యేక ఆహ్వానితులను ఎంపిక చేశారు. ఈ మేరకు టెక్స్‌టైల్ (హస్తకళలు) విభాగంలో ఆదిలక్ష్మి ఎంపికై ంది. ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల అటవీ గ్రామానికి చెందిన సాధారణ ఆదివాసీ గిరిజన మహిళకు పరేడ్‌ను తిలకించే అవకాశం దక్కడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ తనకు ఇలాంటి అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

కాటారం: అండర్-17 జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు కాటారం ట్రైబల్ గురుకుల విద్యార్థి ఎంపికయ్యారు. నవంబర్‌లో మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్‌లో వరంగల్ జట్టు తరఫున కాటారం గురుకులం క్రీడాకారుడు చంటి అత్యంత ప్రతిభ కనబరిచాడు. ఈనెల 10నుంచి 14వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు చంటి ఎంపికైనట్లు వరంగల్ ఎస్‌జీఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి దస్రు, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. వీరి ఎంపిక పట్ల కళాశాల ప్రిన్సిపాల్ లాలు, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు.

సంక్రాంతి శోభ..

- నేటి నుంచి మూడు రోజుల పాటు పండుగ
- రంగవల్లులతో ఆకట్టుకుంటున్న వాకిళ్లు
- పిండి వంటలతో ఘుమఘుమలాడుతున్న ఇళ్లు

వేదవ్యాస ఉన్నత పాఠశాలలో ముందస్తు భోగిమంటలు వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం



నేడు భోగ భాగ్యాల భోగి

సంక్రాంతి పండుగను ప్రజలు మూడు రోజుల పాటు అంగరంగవైభవంగా జరుపుకుంటారు. ఇందులో భాగంగా సోమవారం భోగి, మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను ప్రజలు జరుపుకోనున్నారు. సంక్రాంతి పండుగ నేటి భోగితో ప్రారంభమవుతుంది. భోగి అంటే భోగభాగ్యాలు అనుభవించే రోజుగా జరుపుకోవడం ఆనవాయితీ. పాడిపంటలు ఇళ్లకు వచ్చే సమయం కావడంతో ప్రతీ ఇంటి ముందు భోగి మంటలు వేస్తారు. పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ ఇళ్లలో పాత వస్తువులు, దుస్తులను భోగి మంటల్లో వేస్తారు. చిక్కులన్నీ తొలగిపోయి ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ భోగి జరుపుకుంటారు. ఇదే రోజు పిల్లలకు భోగి పండ్లు పోస్తారు.



బసవన్న విన్యాసాలను తిలకిస్తున్న విద్యార్థులు

ములుగు/వెంకటాపురం(ఎం): జిల్లాలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ప్రతి ఇంటా అందమైన ముగ్గులు, బొమ్మల కొలువులు.. డూడూ బసవన్నలు, హరిదాసుల రాకపోకలతో ఊరూవాడ సందడిగా మారింది. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ హుషారుగా గడుపుతున్నారు. పిండివంటలు చేయడంలో మహిళలు నిమగ్నమయ్యారు. సంక్రాంతిని ఆనందంగా జరుపుకునేందుకు పట్టణాలు, నగరాల్లో ఉన్న వారు స్వస్థలానికి చేరుకున్నారు.

రేపు సంక్రాంతి



ములుగులో రంగులు అమ్ముతున్న వ్యాపారులు

సంక్రాంతి రోజున మహిళలు ఇంటి ఎదుట అందమైన ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలను పెడతారు. బంతి, చేమంతులతో ముగ్గులను అలంకరించి రేగు పండ్లు, ధాన్యం గింజలను గొబ్బెమ్మల వద్ద పెడతారు.. చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా గాలిపటాలు (పతంగులు) ఎగురవేస్తారు. దానం, పితృతర్పణం, దేవతార్చనలు సంక్రాంతి ముఖ్య విధులుగా శాస్త్రాలు నిర్దేశించాయి. మహిళలు పూలు, పసుపు, కుంకుమ, పండ్లు దానం చేయడం వల్ల సకల సంపదలతో పాటు చక్కని సౌభాగ్యం కలుగుతుందని నమ్మకం. ఈ రోజు పితృదేవతారాధన చేస్తే వారి వంశాలు వర్ధిల్లుతాయని పండితులు చెబుతుంటారు.

రైతుల పండుగ కనుమ



రైతన్నలకు అత్యంత ప్రీతిపాత్రమైనది కనుమ పండుగ. వ్యవసాయ పనులలో రైతన్నకు చేదోడు వాదోడుగా ఉంటూ ధాన్యపు రాశులను ఇంటికి చేర్చేవరకు సహాయం చేసే బసవన్నలకు (పశువులు) పూజలు జరిపి పండుగ చేస్తారు. పశువుల కొట్టాలను కడిగి మామిడి తోరణాలు, పూల దండలతో అలంకరిస్తారు. మరికొంతమంది ఆలయాల్లో గల గోమాత కేంద్రాలను సందర్శించి పూజలు నిర్వహించి మేతను గోవులకు తినిపిస్తారు.

వదలం.. కదలం

బదిలీ.. పదోన్నతి.. నెలరోజులకే డిప్యుటేషన్!

- పశుసంవర్ధకశాఖలో బాగోతం
- సీఎం చూస్తున్న శాఖలో ఇష్టారాజ్యం
- డీవీఏహెచ్‌ఓలు, వీఏఎస్‌లదీ ఇదే కథ
- ఫారిన్ సర్వీసుల పేరిట తిష్టకు యత్నం
- డిపార్ట్‌మెంట్‌లో తీవ్ర చర్చ.. స్పెషల్ చీఫ్ సెక్రటరీ పేషీకి ఫిర్యాదులు



సాక్షిప్రతినిధి, వరంగల్ :

'వడ్డించే వాడు మనోడైతే ఏ బంతిలో కూర్చున్న ఒక్కటే' అన్నట్లుంది ఉమ్మడి వరంగల్ జిల్లా పశుసంవర్ధక శాఖలో కొందరు అధికారుల పరిస్థితి. ప్రమోషన్లకు ముందు.. తర్వాత కోరుకున్న చోటే ఉండాలనుకుంటున్నారు కొందరు. ఆ కొందరి కోరిక తీర్చడం కోసం ఉన్నతాధికారులు వారు కోరుకున్న స్థానాలను పదిలంగా ఉంచి 'డిప్యుటేషన్'ల పేరిట వారితోనే నింపేస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి జిల్లా వెటర్నరీ, పశుసంవర్ధకశాఖ అధికారులుగా పదోన్నతులు కలిగిన కొందరు ఫారిన్ సర్వీసుల పేరిట డిప్యుటేషన్ పొందారు. అందులో కొందరు ఐదారు నెలల్లో పదవీ విరమణ పొందే 'బాస్' సీటుపై కన్నేశారని కూడా ఆ శాఖలో చర్చించుకుంటున్నారు. ఇంకొందరు ఇతర జిల్లాలకు వెళ్లినా.. తిరిగి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో డిప్యుటేషన్‌పై చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్న పశుసంవర్ధకశాఖలో సాగుతున్న ఈ అక్రమ డిప్యుటేషన్ల తంతు ఆ శాఖ అధికారులు, సిబ్బందిలో హాట్‌టాపిక్‌గా మారింది. దీనిపై ఫిర్యాదు ఏకంగా ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కి చేరడం చర్చనీయాంశంగా మారింది.

పైరవీలే ప్రామాణికం..

ప్రభుత్వశాఖల్లో పని చేస్తున్న ఏ స్థాయి వారికైనా బదిలీలు, పదోన్నతులు, డిప్యుటేషన్లకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలున్నాయి. కానీ.. రాజకీయ పలుకుబడి, పైరవీల కారణంగా ఆ నిబంధనలు అపహాస్యం అవుతున్నాయి. పశుసంవర్ధకశాఖ హనుమకొండ జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్ కేడర్‌లో పనిచేసిన ఇద్దరికీ ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా స్థానచలనం కలిగింది. పరకాల ఏరియాలోని ఏడీకి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు.. హనుమకొండ డీవీఏహెచ్‌ఓ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న మరొకరికి భీమదేవరపల్లి మండలానికి బదిలీ అయ్యింది. ఈ బదిలీ ఉత్తర్వులు వెలువడిన సుమారు వారం రోజుల్లోనే అవసరాలు, సీనియార్టీ ప్రకారం పదోన్నతుల జాబితా వెల్లడైంది. అందులో సాధారణ బదిలీల్లో భీమదేవరపల్లికి వెళ్లిన అధికారిని కామారెడ్డి జిల్లా వెటర్నరీ, ఎనిమల్ హజ్బెండరీ అధికారి (డీవీఏహెచ్‌ఓ)గా నియమించారు. పరకాల నుంచి హుజూరాబాద్‌కు వెళ్లిన మరో అధికారికి పదోన్నతి కల్పించి డీవీఏహెచ్‌ఓగా ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. ఆయా జిల్లా కేంద్రాల్లో అవసరాన్ని గుర్తించే అధికారులుగా వారిని నియమించారు. ఐదారు రోజులైనా అక్కడ లేకుండా ఒకరు కరీంనగర్‌లోని ప్రోజెన్ సెమన్ బుల్ సెంటర్ (ఎఫ్‌ఎస్‌బీఎస్)కు, మరొకరు వెటర్నరీ కాలేజీ టీచింగ్ ఫ్యాకల్టీగా తిరిగి వరంగల్‌కు చేరడం ఆ శాఖ ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది.

ఎడాపెడా డిప్యుటేషన్‌లు..

దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న.. ఇతర ప్రాంతాల్లో అవసరం ఉన్న పలువురిని ప్రభుత్వం బదిలీ చేసింది. బదిలీ అయిన చోట పని చేయలేమని పైరవీలు చేసుకున్న పలువురికి కొందరు అధికారులు ఎడాపెడా డిప్యుటేషన్లు ఇచ్చారు.

- కరీంనగర్ నుంచి హనుమకొండ జిల్లా ఐనవోలు మండలానికి బదిలీపై వచ్చిన ఓ అధికారి కొంతకాలం పనిచేసి.. ఓ ముఖ్యనేత సిఫారసుతో కరీంనగర్ జిల్లా మానకొండూరుకు 'డిప్యుటేషన్' చేయించుకున్నాడు.
- మహబూబాబాద్‌కు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్‌కు జనరల్ ట్రాన్స్‌ఫర్స్‌లో పెద్దపల్లి జిల్లా కు బదిలీ కాగా.. ఖాళీగా ఉన్న భీమదేవరపల్లి మండలానికి డిప్యుటేషన్‌పై వచ్చారు.
- హనుమకొండ నుంచి హుజూరాబాద్‌కు ఏడీగా బదిలీ అయి డీవీఏహెచ్‌ఓ పదోన్నతి పై వెళ్లిన అధికారి స్థానంలో జోన్-1 పరిధి నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన ఓ అధికారిని నియమించారు.
- ఖమ్మం జిల్లాకు చెందిన ఒకరు ఎల్కతుర్తి మండలానికి వచ్చారు.
- వరంగల్ నగరంలో నివాసం ఉండే ఏడీ స్థాయి ఒకరు, వరంగల్ జిల్లా వర్ధన్నపేట నుంచి మరో అధికారి ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలకు బదిలీ అయినా... అక్కడి ఉన్నతాధికారులను మెప్పించి ఇక్కడిక్కడే తిరుగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.
- వీరు డిప్యుటేషన్లకు ప్రయత్నించినా ఫలితం లేక పోవడంతో పాసులు తీసుకుని అడపాదడపా వెళ్తున్నారన్న చర్చ ఆ శాఖలో చర్చ ఉంది.

ఇలా ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఎడాపెడా సాగిన 'డిప్యుటేషన్'ల దందాపై ఆ శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేయడం కలకలం రేపుతోంది.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వేదికపై మంత్రులు సీతక్క, సురేఖ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు, 'కుడా' చైర్మన్, నగర మేయర్ తదితరులు

- కాంగ్రెస్ హయాంలో సంక్షేమం నిరంతర ప్రక్రియ
- మొదటి విడతలో పేరు లేని వారికి తర్వాతి విడతల్లో లబ్ధి
- ప్రజాపాలన యాప్‌లో నమోదుకాని దరఖాస్తులు మ్యాన్యువల్‌గా నమోదు
- ఉమ్మడి జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హన్మకొండ అర్బన్ : రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈనెల 26 నుంచి రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా మొదలుకానున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ పథకాలపై ఆదివారం హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు, ఇతర కార్పొరేషన్ల చైర్మన్లతో కలిసి ఉమ్మడి వరంగల్ కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కాంగ్రెస్ హయంలో సంక్షేమం అనేది నిరంతర ప్రక్రియ అని, అనివార్య కారణాలతో మొదటి విడతలో అర్హత ఉండి లబ్ధి చేకూరని వాళ్లకు తర్వాత విడతల్లో లబ్ధి చేకూరుతుందనే భరోసా అధికారులు ఇవ్వాలన్నారు. పేదోడి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయ్యిందని పేర్కొన్నారు. గడిచిన సంవత్సర కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం మరికొన్ని సంక్షేమ పథకాలను పేద ప్రజల దరి చేర్చాలనే సదుద్దేశంతో 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నాలుగు సంక్షేమ పథకాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. అర్హత ఉండి.. ఏదైనా కారణాల రీత్యా రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక యాప్‌లో నమోదు కాకపోతే వాటిని మ్యాన్యువల్‌గా నమోదు చేసుకుని తర్వాత విడతల్లో లబ్ధి చేకూరుతుందనే భరోసా ముందుగానే ఇవ్వాలని సూచించారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ ఉండాలని, ఆ దిశగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధుల సందేహాలను మంత్రి నివృత్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, సత్యనారాయణరావు, కేఆర్.నాగరాజు, హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ వినయ్‌కృష్ణారెడ్డి, కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద, షేక్ రిజ్వాన్ బాషా, దివాకర, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఐటీడీఏ పీఓ మిశ్రా, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి పొంగులేటిని మంత్రులు సన్మానించారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



హాజరైన కలెక్టర్లు, అధికారులు

సంక్రాంతి ముగ్గుల పోటీలు

ఏటూరునాగారం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పీఆర్ఆర్ యూనిటీ అండ్ చారిటీ ట్రస్ట్, స్టార్ యూత్ ఆధ్వర్యంలో శ్రీవాసవివి కన్యక పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి న్యాయ నిర్ణేతలు కాంగ్రెస్ పార్టీ నాయకుడు సూర్య, భాగ్యమ్మ, సరితలు బహుమతులను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు మడుగురి నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు కిరణ్, భిక్షపతి, లక్ష్మణాచారి, నూక ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న యువతులు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్, నియోజక వర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. మండల పరిధిలోని మేడారంలో ఆదివారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని చెప్పి.. ఏడాది పాలన పూర్తయినా పథకాలు మాత్రం అమలు కావడం లేదన్నారు. ఈ నెల 26నుంచి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ప్రకటించి స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులు నేటికీ పదిలంగా ఉన్నాయన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ మేరకు స్థానిక ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులుగా దండుగుల మల్లయ్య, దిడ్డి మోహన్ రావు, రామసాయం శ్రీనివాసరెడ్డి, ముండ్రాతి రాజమౌళి, కొండూరి నరేష్, జీడి బాబు, గోపన బోయిన కొమురయ్య, పాయం నర్సింగరావులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ దుర్గం రమణయ్య, మేడారం జాతర కమిటీ మాజీ చైర్మన్ కాక లింగయ్య, నాయకులు ఎనగందుల బాపిరెడ్డి, చిడం బాబురావు, సిద్ధబోయిన శివరాజు, అలేటి ఇంద్రారెడ్డి, దానుక నర్సింగరావు, గజ్జల సమ్మయ్య, గోపాల్‌రెడ్డి, ఎల్లయ్య, విక్రమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగజ్యోతి

పర్యాటకుల సందడి

వెంకటాపురం(ఎం)/మంగపేట: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలైన రామప్ప, హేమాచల క్షేత్రంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సెలవులు రావడంతో ఉద్యోగులు, విద్యార్థులు ఆలయానికి భారీగా తరలివచ్చారు. వెంకటాపురం మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయానికి వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఓంకారం అలంకరణలో పర్యాటకులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించగా టూరిజం గైడ్‌లు ఆలయ విశిష్టత గురించి పర్యాటకులకు వివరించారు. పర్యాటకులు అధికసంఖ్యలో తరలిరావడంతో రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు అరగంటకు పైగా సమయం పట్టింది. పోలీసులు క్యూలో భక్తులను పంపిస్తూ చర్యలు తీసుకున్నారు. అదే విధంగా మంగపేట మండలంలోని మల్లూరు గుట్టపై గల శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వేలాది మంది భక్తజనంతో కిక్కిరిసిపోయింది. భక్తులు ఉదయాన్నే గుట్టపైకి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణంలో భక్త జనసందడి నెలకొంది, ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి హేమాచల కొండపై ఉన్న స్వామివారి ప్రధానాలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు స్వామివారికి రెండు గంటల పాటు తిల తైలాభిషేకం పూజా కార్యక్రమాలను నిర్వహించి నూతన పట్టు వస్త్రాలు వివిధ రకాల పూలతో అలంకరింపజేశారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొని మానవ శరీరంతో పోలి ఉండే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని భక్తులు పులకించారు. ఆలయ పూజారులు భక్తుల గోత్ర నామాలతో స్వామివారికి ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణం వివరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు.



ఓంకార అలంకరణలో దర్శనమిస్తున్న రామలింగేశ్వరస్వామి




ప్రత్యేక అలంకరణలో హేమాచల లక్ష్మీనర్సింహస్వామి



రామలింగేశ్వరస్వామి దర్శనానికి గర్భగుడి ఎదుట..



పర్యాటకులకు ఆలయ విశిష్టతను వివరిస్తున్న గైడ్



హేమాచలక్షేత్రంలో భక్తులు

వండర్ కిడ్.. అద్వితీరాజ్

● తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకుంటున్న మాస్టర్ అద్వితీరాజ్



అవార్డుతో అద్వితీరాజ్

సంగెం: వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన బస్కె అరుణ-రాజు దంపతుల నాలుగు న్నరేళ్ల అద్విత్ రాజ్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించాడు. శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన చిన్నారులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రదానం చేశారు. మాస్టర్ బస్కె అద్విత్ రాజ్ కేవలం నిమిషం 54 సెకండ్లలో 196 దేశాల పేర్లు, వాటి జాతీయ జెండాలను, 8 నిమిషాల్లో 196 దేశాల పేర్లు వాటి రాజధానులను గుక్క తిప్పుకోకుండా చెప్పాడు. రసాయన శాస్త్రంలోని 118 ఆవర్తన మూలకాలను, భారతదేశ రాష్ట్రాలను, వాటి రాజధానుల పేర్లు తెలిపాడు. అద్భుతమైన జ్ఞాపకశక్తి, విజ్ఞాన నైపుణ్యాలను కలిగిన మాస్టర్ అద్విత్‌రాజ్‌ను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గుర్తించి సన్మానించారు. కార్యక్రమంలో హైదరాబాద్ అడిషనల్ పోలీస్‌కమిషనర్ కేఎం కిరణ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ చింతపట్ల వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.



మల్లన్న జాతర ప్రాంగణం

మల్లన్నా.. శరణు శరణు

ప్రారంభమైన ఐనవోలు జానపదుల జాతర | ధ్వజారోహణం కార్యక్రమంతో ఉత్సవాలు షురూ..

● తొలిరోజు స్వామివారిని దర్శించుకున్న 20వేల మంది భక్తులు
● వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రత్యేక పూజలు

ఐనవోలు: లక్షలాది మంది ఇలవేల్పు.. కోట్లాది మంది భక్తుల కొంగు బంగారం.. ఐనవోలు శ్రీ మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు షురూ అయ్యాయి. ఆదివారం ధ్వజారోహణ కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రాతః కాలంలో ఒగ్గు పూజారులు స్వామివారికి మేలుకొలుపు పలికారు. మూలవరులు గొల్లకేతమ్మ, బలిజమేడలమ్మ, మల్లికార్జునస్వామి వారికి నూతన వస్త్రాలను ధరింపజేశారు. అర్ధప్రాణ వట్ట శివలింగానికి(మల్లన్న) వేద పండితులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. అర్చకులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం చేసిన తర్వాత రెండు ధ్వజంలకు కాషాయ పతాకాలు ఏర్పాటు చేశారు. ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు పాతర్లపాటి శ్రీనివాస్ ఆ పతకాలను చేతబూని ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఈ గౌరిశంకర్‌తో కలిసి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేశారు. అనంతరం జాతరకు ఎలాంటి ఆటంకాలు కలగొద్దని, మల్లన్న పరివార దేవుళ్లను ఆవాహన (పిలిచి) చేసే ప్రక్రియను వేదమంత్రాల ద్వారా జరిపించారు. ఆ కాషాయ పతాకాలను మల్లికార్జున స్వామి దేవస్థాన క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామి ఆలయంపై, మల్లికార్జునుడి ఆలయంపై ప్రతిష్ఠింపజేసి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ప్రకటించారు.

నేడు భోగి ఉత్సవాలు

భోగి సందర్భంగా సోమవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, దర్శనాలు ఉంటాయని అర్చకులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు భక్తులు స్వామివారిని దర్శించుకోనున్నారు.

బోనాలు, పట్నాలు

మల్లన్న ఆలయానికి చేరుకుంటున్న భక్తులు ముందు ఒగ్గు పూజారులతో పట్నం వేయించుకుంటున్నారు. అనంతరం బోనాలు వండి ఎల్లమ్మ దేవతకు సమర్పిస్తున్నారు.అనంతరం గర్భాలయంలోని శ్రీమల్లికార్జునుడిని దర్శించుకుంటున్నారు. కొంతమంది భక్తులు వరంపట్టడం, కొబ్బరి కాయ బంధనం, ముడుపులు కట్టారు.

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు




వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావుతో కలిసి జాతర 4 రోజులకు సంబంధించి నియామకమైన ఉత్సవ కమిటీ సభ్యులను సన్మానించారు.

ఉత్సవ కమిటీ సభ్యులు

నూతన ఉత్సవ కమిటీలో కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, మునాల సుదర్శన్‌రెడ్డి, బందెల వెంకన్న, ధరం పూర్ణచందర్, బండ సరిత, గుంటి కుమారస్వామి, కొండేటి మమత, నూనావత్ కీమానాయక్, కూస చిరంజీవి, పెండ్లి సంపత్, దోమకొండ హరీశ్, నూతనగంటి రాజు, పల్లకొండ రమేశ్, సిరిమల్ల మధుసూదన్ ఉన్నారు.

భక్తులకు అండ.. కొత్తకొండ

● వీరభద్రస్వామి వారి జాతరకు ఏర్పాట్లు పూర్తి
● నేడు భోగి, రేపు సంక్రాంతి, బండ్లు తిరిగే కార్యక్రమం



కొత్తకొండ వీరభద్రస్వామి వారి ఆలయం

ఎల్కతుర్తి: స్వామివారికి కోరమీసాలు సమర్పిస్తే చాలు.. కోర్కెలు తీర్చి భక్తులకు కొండంత అండగా నిలిచే కొత్తకొండ వీరభద్రస్వామి వారు బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రుడి జాతర ప్రతీ సంవత్సరం సంక్రాంతి మాసంలో వైభవంగా జరుగుతుంది. ఈ జాతరకు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్, సిద్దిపేట జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ ఏడాది 10లక్షల మంది భక్తులు హాజరవుతారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో బ్రహ్మోత్సవాల్లో ప్రథమ ఘట్టం స్వామివారి కల్యాణం ఈనెల 10న పూర్తయింది. ఇక ఈ నెల 13 (నేటి) నుంచి 18వ తేదీ వరకు జరిగే జాతరకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



ఆలయంలో కొలువై ఉన్న స్వామి వారు

వీరభద్రస్వామి స్థల పురాణం..

కాకతీయ రుద్రేశ్వరుడి కాలంలో మల్లికార్జున పండితుడి మనుమడు కేదారి పండితుడిచే వీరభద్రస్వామి ఆలయం శైవగామనుసారం ప్రతిష్ఠించబడినట్లు స్థలపురాణం చెబుతుంది. సుమారు 16 వందల ఏళ్ల క్రితం కొంతమంది కుమ్మరులు కొండపైకి ఎడ్లబండ్లు కట్టుకొని వెళ్లారు. అక్కడ తమకు అవసరమయ్యే కర్రలు (కట్టెలు) కొట్టుకుని ఎడ్లబండ్లలో వేసేందుకు చూడగా ఎడ్లబండ్లు కనిపించలేదు. దీంతో వారు కొండచుట్టూ కలియ తిరిగి అలసిపోయి అక్కడే ఆ రాత్రి నిద్రించారు. వీరభద్రుడు వారి కలలో కనిపించి నన్ను కొండపైనుంచి దింపి కింద ఉన్న ఆలయంలో ప్రతిష్ఠించమని చెప్పాడు. దీంతో కేదారి పండితుడిచే స్వామివారిని కిందకు దింపి ఆలయంలో ప్రతిష్ఠించారు.

జాతర ప్రధాన ఘట్టాలు

ఈనెల13న భోగి పండుగ, 14న సంక్రాంతి, బండ్లు తిరుగుట, 15 కనుమ ఉత్సవం, 16న నాగవెల్లి, పుష్పయాగం, 17న త్రిశూల స్నానం, 18న అగ్నిగుండాలు స్వామి వారి గ్రామ పర్యటన ఉంటుంది.

జాతరలో సేవలు..

భీమదేవరపల్లి ఎంపీడీఓ వీరేశం, ఎంపీఓ నాగరాజు ఆధ్వర్యంలో పారిశుధ్యం, ముల్కనూరు, వంగర పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించనున్నారు. అలాగే, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో తాగునీరు, హనుమకొండ, వరంగల్, హుస్నాబాద్, హుజూరాబాద్ డిపోల ఆధ్వర్యంలో 13,14,15వ తేదీల్లో కొత్తకొండకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. కాజీపేట ఏసీపీ తిరుమల్ పర్యవేక్షణలో ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్ ఆధ్వర్యంలో సుమారు 450 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. అలాగే, జాతరకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడవనున్నాయి.

-కిషన్‌రావు, ఆలయ ఈఓ

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

జాతరలో శానిటేషన్, పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాం. అలాగే, కోనేటి వద్ద ఉన్న స్నాన ఘట్టాల వద్ద మహిళా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశాం.

-వీరేశం, ఎంపీడీఓ

మూడో రోజు అదే జోరు

● కొనసాగుతున్న సెపక్‌తక్రా పోటీలు
● రేగు ఈవెంట్‌లో తలపడిన క్రీడాకారులు




పోటీలో తలపడుతున్న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యాన హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న 34వ సీనియర్ నేషనల్స్ సెపక్‌తక్రా మెన్‌అండ్ ఉమెన్ చాంపియన్ షిప్ పోటీలు మూడో రోజు ఉత్కంఠగా సాగాయి. ఆదివారం రేగు ఈవెంట్‌లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిన మహిళలు, పురుషుల విభాగాల్లో పోటీలు హోరాహోరీగా జరిగాయి. బెస్ట్ ఆఫ్ త్రీ పద్ధతిలో కొనసాగిన పోటీలు ఆద్యంతం ఉత్కంఠతను రేకెత్తించాయి.

స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రయ్య మృతి

● పరకాల మండలం వెల్లంపల్లిలో విషాదం



పరకాల: నిజాం పాలన విముక్తి కోసం పోలీసు పటేల్ ఉద్యోగాన్ని వీడి తెలంగాణ సాయుధ పోరాటంలో పాలుపంచుకున్న పరకాల మండలం వెల్లంపల్లికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు రేగూరి చంద్రయ్య (98) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. 1947 సెప్టెంబర్2న పరకాల చాకలిబండ వద్ద జరిగిన కాల్పుల ఘటనలో చంద్రయ్య కూడా గాయపడ్డాడు. రజకార్ల అకృత్యాలను కళ్లకు కడుతూ తన సన్నిహితులు, గ్రామస్తులకు వివరించడమే కాకుండా పలు పత్రికలు, వివిధ చానెళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చిన చంద్రయ్య మృతితో వెల్లంపల్లి చిన్నబోయింది. ఆయన మృతిపై పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

టీచర్, లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న పూల రవీందర్

విద్యారణ్యపురి: జాక్టో మద్దతుతో తాను వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బరిలో ఉండబోతున్నానని, తనను గెలిపిస్తే టీచర్, లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ పూలరవీందర్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని ఎస్‌టీయూ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనమండలిలో ఉపాధ్యాయ,అధ్యాపకుల సమస్యలపై సరిగా ప్రాతినిథ్యం జరగడం లేదని, ఫలితంగా అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. గతంలో తాను ఆరు సంవత్సరాలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేశానని, అనేక సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించానన్నారు. ఈ ఏడాది మార్చిలో జరగబోయే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. గెలిపిస్తే సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికీ పాతన పెన్షన్ విధానం అమలు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 317 జీఓతో స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయలందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎ. సదయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కామగొని రాంబాబు, వరంగల్, జనగామ జిల్లాల ప్రధాన కార్యదర్శులు దానం నాగరాజు, నర్సిమయ్య, బీసీటీఏ వరంగల్, భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు శైలేందర్, ప్రవీణ్, అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

క్రెడాయ్ ప్రాపర్టీ షోకు అనూహ్య స్పందన

● 5వేల మందికి పైగా స్టాళ్ల సందర్శన



ప్రాపర్టీ షోలో ఇంజనీర్లను సన్మానిస్తున్న సంఘం అధ్యక్షుడు తిరుపతి రెడ్డి

కాజీపేట : కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీ పీజీఆర్ గార్డెన్స్‌లో రెండు రోజులుగా సాగుతున్న 3వ క్రెడాయ్ ప్రాపర్టీ షో ఆదివారం కొనుగోలుదారుల అనూహ్య స్పందన మధ్య ముగిసింది. క్రెడాయ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోలో 18కి పైగా సంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేయగా దాదాపు 5వేల మందికి పైగా సందర్శించి తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో పేరెన్నిక గల అనేక సంస్థలు ప్రాపర్టీ షోలో భాగస్వామ్యం పంచుకున్నాయి. 3వేల మంది వరకు బహుళ అంతస్తులు, విల్లాలు, ప్లాట్ల కొనుగోళ్లకు తమ అవసరమైన సమాచారం సేకరించుకున్నారు. ఈ ప్రాపర్టీ షోలో భవన నిర్మాణానికి అవసరమైన ముడి సరుకు దుకాణాలు ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనేక మంది తమ అభిరుచికి అనుగుణంగా విల్లాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లను బుక్ చేసుకోవడం విశేషం. ప్రాపర్టీ షోలో పేర్లు నమోదు చేసుకున్న వ్యక్తులకు ఆయా సంస్థలు రాయితీలను ప్రకటించాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఇంజనీర్లు, బ్యాంకర్లును క్రెడాయ్ సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి, సత్యనారాయణ రెడ్డి సన్మానించారు.

కృపియా ధ్యాన్ దే..

● కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల కోసం సదుపాయాలు
● ఏసీ డార్మెటరీ రూమ్స్, రౌండ్ ద క్లాక్ ఎంక్వైరీ కౌంటర్ ఏర్పాటు



కాజీపేట జంక్షన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్ల సముదాయం

కాజీపేట రూరల్ : ఉత్తర, దక్షిణ భారత్ కూడలి.. రోజూ 80 రైళ్లు.. 20 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే స్టేషన్.. సౌత్ సెంట్రల్ రైల్వేలో కీలకం.. కాజీపేట జంక్షన్. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఈ జంక్షన్‌లో రైల్వే శాఖ ప్రయాణికులకు సౌకర్యాలు, సదుపాయాలు ఏర్పాటు చేసింది. కాజీపేట జంక్షన్ నుంచి న్యూఢిల్లీ, హైదరాబాద్, విజయవాడ మార్గంలో రోజూ సుమారు 20 వేల మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ జంక్షన్ మీదుగా దాదాపు 80 ప్రయాణికుల రైళ్లు రాకపోకలు చేస్తాయి. దీంతో జంక్షన్‌కు ప్రయాణికుల నుంచి రోజు రూ.15 లక్షల ఆదాయం వస్తుంది.

కాజీపేట జంక్షన్‌లో టికెట్ కౌంటర్లు

కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల కోసం నాలుగు అన్ రిజర్వ్‌డ్ టికెట్ కౌంటర్లు, ఒక రిజర్వేషన్ కౌంటర్, ఒక దివ్యాంగులు, స్త్రీలు, వయోవృద్ధుల టికెట్ కౌంటర్ అందుబాటులో ఉన్నాయి. రౌండ్ ద క్లాక్ ఎంక్వైరీ కౌంటర్ రైళ్ల సమాచారం ఇస్తుంది. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు రిజర్వేషన్ కౌంటర్లు పని చేస్తాయి.

తత్కాల్ సేవల సమయం

రోజూ ఉదయం 10 గంటలకు స్లీపర్ క్లాస్ తత్కాల్ సేవలు ప్రారంభమవుతాయి. రోజూ ఉదయం 11 గంటలకు తత్కాల్ ఏసీ సేవలు ప్రారంభమవుతాయి..

ఏసీ డార్మెటరీ, విశ్రాంతి గదులు

కాజీపేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల కోసం ఆర్‌సీటీసీ యాజమాన్యం ఏసీ డార్మెటరీ, విశ్రాంతి గదుల సౌకర్యం ఏర్పాటు చేశారు. డార్మెటరీ రూమ్స్ కావాల్సిన వారు ప్రయాణ టికెట్ కలిగి ఉండి, ఆన్‌లైన్‌లో ఐఆర్‌సీటీ ద్వారా బుక్ చేసుకోవాలి. వివరాలకు 6300892095 నంబర్‌లో సంప్రదించాలి.

రైల్వే కూలీల చార్జీల వివరాలు

కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికులకు రైల్వే కూలీలు అందుబాటులో ఉంటారు. రైలు దిగిన చోట నుంచి స్టేషన్ బయట వరకు ఒకరికి 40 కేజీల వరకు రూ.85, చక్రాల కుర్చీ లేదా స్ట్రెచర్‌లో తరలించేందుకు రూ.95, ట్రాలీ లోడ్‌ను తరలించేందుకు రూ.175 చార్జీ తీసుకుంటారు.

అందుబాటులోని సౌకర్యాలు

దివ్యాంగుల కోసం మరుగుదొడ్లు, పే అండ్ యూజ్ టాయిలెట్స్, బుక్‌స్టాల్, మిల్క్ డైరీ స్టాల్, జ్యూస్ స్టాల్, తెలంగాణ టూరిజం కౌంటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కెలేటర్, లిఫ్ట్, రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) పోలీస్‌స్టేషన్, జీఆర్‌పీ స్టేషన్, జనరల్ వెయింటింగ్ హాల్, స్లీపర్ క్లాస్ వెయింటింగ్ హాల్, లేడీస్ వెయిటింగ్ హాల్, ఏటీఎం సెంటర్, రైల్వే ఫుడ్‌ప్లాజా, రైల్వే పార్సిల్ ఆఫీస్, క్లాక్‌రూం సౌకర్యాలు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి.

కాజీపేట రైల్వే ఎంక్వైరీ నంబర్: **0870-2576430**
రైల్వే టోల్‌ఫ్రీ ఫిర్యాదు నంబర్: **139**

కాంగ్రెస్ శిక్షణ తరగతుల్లో జిల్లా వాసులు



సర్టిఫికెట్ అందుకున్న ఉమ్మడి వరంగల్ నాయకులు

హన్మకొండ: కాంగ్రెస్ ఆదివాసీ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యాన నాగార్జునసాగర్‌లో జరిగిన శిక్షణ తరగతుల్లో ఉమ్మడి వరంగల్ చైర్మన్ గుగులోత్ రవీందర్‌నాయక్‌తో పాటు ఎస్టీ నాయకులు గుగులోత్ శంకర్ నాయక్, భూక్యా శంకర్ నాయక్, గుగులోత్ రవి నాయక్, మల్లీశ్వరి, సమ్మయ్య నాయక్, నరేశ్ నాయక్, ఆనంద్‌రావు పాల్గొన్నారు. వారం రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రాయితో మోది.. పెట్రోల్‌తో తగులబెట్టి

జనగామలో యువకుడి దారుణ హత్య
● రెండేళ్ల పగతో ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులు
● ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసు అధికారులు



వెంకన్న (ఫైల్)

జనగామ: రెండేళ్ల పగతో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన వెంకన్న (35) పదిహేనేళ్ల క్రితం జనగామకు వచ్చాడు. రైల్వేస్టేషన్ ఆవరణలో భిక్షాటన చేస్తూ తన వద్ద ఉన్న కోతితో సర్కస్ చేయిస్తూ కడుపు నింపుకుంటున్నాడు. రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యలు చేసుకున్న మృతదేహాలను తరలించడంలో రైల్వే పోలీసులకు సహకరిస్తున్నాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం ముగ్గురు యువకులు(హత్య చేస్తున్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులు) ప్లాట్‌ఫాంపై సిగరెట్లు తాగుతుండగా రైల్వే పోలీసులు బెదిరించారు. ఈ సమయంలో అక్కడే ఉన్న వెంకన్న కూడా ఆ యువకులను మందలించాడు. ఇది మనసులో ఉంచుకున్న సదరు యువకులు వెంకన్నపై కోపం పెంచుకున్నారు. ఈ నెల 11వ తేదీన(శనివారం) రాత్రి సమయంలో ముగ్గురు యువకులు హనుమకొండ రోడ్డులోని వినాయక బార్‌లో మద్యం సేవించారు. అదే సమయంలో వెంకన్న అక్కడకు వెళ్లి మద్యం తీసుకుంటుండగా సదరు యువకులు అతడి వద్దకు వచ్చి వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో అక్కడే ఉన్న బండరాయితో తలపై మోది... బార్ వెనుకకు తీసుకెళ్లి హత్య చేశారు. మృతదేహం గుర్తుపట్టకుండా పెట్రోలు పోసి తగుల బెట్టగా 20 శాతం మేర కాలి పోయింది. మృతుడి స్నేహితుడు శ్రీకాంత్ ద్వారా సమాచారం అందుకున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండేరి చేతన నితిన్, నర్మెట సీఐ అబ్బయ్యగౌడ్ ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎస్సైలు చెన్నకేశవులు, శ్వేత, సిబ్బంది ఉన్నారు. కాగా, వెంకన్న హత్య కేసులో మద్యం తాగుతున్న సదరు యువకులు రూ.300 బిల్లు చెల్లించే విషయంలో గొడవ జరిగి హత్యకు దారి తీసిందనే మరో ప్రచారం జరుగుతోంది.

యువ కౌలు రైతు ఆత్మహత్య



వెంకన్న(ఫైల్)

పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక శివారు సోమ్లాతండాకు చెందిన యువ కౌలు రైతు భూక్య వెంకన్న(30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై బోగం ప్రవీణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య వెంకన్నకు భూమి లేదు. 12 ఎకాలు కౌలుకు తీసుకుని వరి, మొక్కజొన్న పంటలు పండిస్తున్నాడు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో మూడేళ్లలో రూ.10 లక్షల వరకు అప్పు అయింది. అవి తీర్చే మార్గం కనిపించక శనివారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంకన్నను వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. కాగా, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్థిక ఇబ్బందులతో హమాలీ..



రాజు (ఫైల్)

నెక్కొండ: ఆర్థిక ఇబ్బందులతో ఓ హమాలీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నెక్కొండ పట్టణంలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పోరండ్ల రాజు (37) హమాలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణకు రూ. 2 లక్షల అప్పు అయ్యింది. అప్పు ఎలా తీర్చాలని రాజు కొంత కాలంగా మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు గమనించి ఎంజీఎం తలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ ఆదివారం పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పండుగకు వచ్చి పరలోకాలకు..

● నీటి సంపులో పడి బాలుడి మృతి
● ఆశాలపల్లిలో ఘటన



రివాన్స్(ఫైల్)

సంగెం: సంక్రాంతి పండుగకు సంతోషంగా అమ్మమ్మ ఇంటికి వచ్చిన ఓ బాలుడు పరలోకాలకు చేరాడు. తల్లిదండ్రులు ఇంట్లో పనిలో ఉండగా ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలం ఆశాలపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తికి చెందిన నీరటి రాజు, స్రవంతి దంపతులకు ఇద్దరు కుమారులు అన్విత్, రివాన్స్(3) ఉన్నారు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగ కోసం శనివారం ఆశాలపల్లికి వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు పనిలో ఉండగా రివాన్స్ ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. కొంత సమయం తర్వాత రివాన్స్ కనిపించకపోవడంతో వెతికారు. చివరకు నీటి సంపులో చూడగా అందులో పడి కనిపించాడు. వెంటనే ఎంజీఎం తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనతో తల్లిదండ్రులు బోరున విలపించారు. బాలుడి మృతదేహం మీద పడి గుండెలవిసేలా రోదించారు. బాలుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చందర్‌రావు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రాయపర్తి: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన ఆదివారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండూరులో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ సింగారపు ఎల్లయ్య కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంగారపు ముత్తమ్మ(57) ఇల్లు కడుగుతోంది. ఈ క్రమంలో ఇంట్లో చీకటి ఉండడంతో స్విచ్‌బోర్డు ఆన్ చేయగా విద్యుత్‌షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పత్తిపాకలో పాలేరు..

శాయంపేట : విద్యుదాఘాతంతో పాలేరు మృతి చెందాడు.ఈ ఘటన మండలంలోని పత్తిపాకలో జరిగింది. ఎస్సై పరమేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాదం కొమురయ్య (51) అదే గ్రామానికి చెందిన పిన్నంటి కిషన్‌రెడ్డి వద్ద పాలేరుగా పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే శనివారం కూడా పొలం వద్ద పనులు చేస్తూ వ్యవసాయ మోటారు ఆన్ చేయడానికి వెళ్లాడు. మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి కింద పడ్డాడు. గమనించిన కిషన్ రెడ్డి కేకలు వేయగా పక్కన ఉన్న రైతులు చేరుకుని చూడగా అప్పటికే కొమురయ్య మృతి చెందాడు. మృతుడి భార్య కొమురమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరణంలోనూ వీడని బంధం..

● భర్త మృతి తట్టుకోలేక భార్య కన్నుమూత
● తాడ్వాయిలో ఘటన



నర్సయ్య (ఫైల్)



వీరలక్ష్మి (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి: మరణంలోనూ ఆ దంపతుల బంధం వీడిపోలేదు. జీవించి ఉన్నంత కాలం అన్యోన్యంగా ఉన్న వారిని చావు కూడా వేరు చేయలేకపోయింది. భర్త మరణాన్ని జీర్ణించుకోలేని భార్య.. అతడి పెద్ద కర్మ జరిగిన మరుసటి రోజు మృతి చెందింది. ఈ విషాదకర ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బుర్ర నర్సయ్య(68) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈనెల 11న అతడి పెద్ద కర్మ కార్యక్రమం నిర్వహించారు. మరుసటి రోజే భర్త మృతిని తట్టుకోలేక మనోవేదనతో భార్య వీరలక్ష్మి(65) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. 12 రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.